# మీసాల మేష్టారు!

మేష్టారి అసలు పేరేమిటో మావూళ్లో ఎవరికీ తెలియదు. ఆయన పొడవాటి వొత్తైన మీసాలు చూచి అందరూ ఆయన్ను మీసాల మేష్టారనే పిలుస్తారు.

ఆరడుగల విగ్రహం... పెద్ద పెద్ద మీసాలతో భయం గొలుపుతూండే మాష్టారంటే వూళ్లో చిన్న పెద్ద అందరికీ గౌరవం! అంతేసి మీసాలు రాక్షసులకు మాత్రమే వుంటాయని పుస్తకాల్లో చదువుకున్నాం!

మాష్టారి పర్సనాలిటీకి అంతపెద్ద మీసాలు అందాన్నిచ్చాయి! ఆయన ఏం చదువుకున్నారో ఏమో చాలామందికి తెలియదు.

వీధి చివర పాడుబడిన పెంకుటింటి ముందు విశాలమైన అరుగుంది. దాని మీద పిల్లలు కూర్చుని పలకల మీద మేష్టారు రాసిచ్చిన తెలుగు అక్షరాలు దిద్దుకుంటూ వుంటారు. పద్యాలు... ఎక్కాలు వల్లె వేస్తూంటారు.

మీ మాస్టారు గారి చేతులో ఎల్లవేళలా అయిదు అడుగుల పేము బెత్తం వుంటుంది. అ బెత్తంలో ఆయనెప్పుడూ పిల్లలను కొట్టిన పాపాన పోలేదు.

మేష్టారు గుడ్లురిమితే చాలు పిల్లలు చెడ్డీలు తడుపుకుంటారు. ఆయన పెళ్లాం పిల్లలు సంసారం అంటూ లేదు. వంట ఆయనే చేసుకుంటాడు. ఇల్లు ఆయనే తుడుచుకుంటాడు. అంట్ల బొచ్చలు ఆయనే స్వయంగ తోముకుంటాడు. గుడ్డలకు సబ్బుపెట్టి ఆరేసుకుని చెంబు ఇస్త్రీ చేసుకుంటాడు.

మేష్టారు బడి పంతులేం కాదు. ఏం చదువుకున్నాడో ఎవరికీ తెలియదు. పెద్ద బాల శిక్ష క్షుణ్ణం వచ్చు. పుస్తకంలో ప్రతి అక్షరాన్ని ఆకళింపు చేసుకుని జీర్ణించుకున్నవాడు.

అదే పెద్ద బాలశిక్షనే ట్యూషన్ పిల్లలకు బోధించటం ఆయన అలవాటు!

పిల్లలమీద మేష్టారికికోపం రానేరాదు. ఒకవేళ వచ్చినా.. ఎర్రని ఎండలో కాళ్లు బొబ్బలెక్కేదాకా నిలబెట్టడు. గోడకుర్చీవేయించడు. బెత్తంతో చావచితకొట్టడు.

అంతగ కోపాన్ని అపుకోలేకపోతే... పాఠం శ్రద్ధగా వినకపోయినా.. అప్పగించికపోయినా.. వాళ్ల చేత తన మీసాలు నారతాడు పేని నట్టు పేనిస్తాడు. మేలేబెట్టిన మీసాలమీద నిమ్మకాయలు నిలబెట్టించుకుంటాడు. అల్లరి పిల్లలతో

మీసాలకు కొబ్బరినూనె పట్టించి దువ్వెనతో దువ్వమంటాడు.

ఎందుకు సార్... ఇంతంత పెద్ద మీసాలు మీకున్నయ్ అని గడుగ్గాయి ఎవరైనా అడిగితే.... మీసమున్న మగాడికి రోషముంటుందిం రా వెధవాయ్! మీసం లేనివాడు ఆడవారితో సమానం! అసలు మీసాల్లో ఎన్ని రకాలున్నాయో మీకు తెలుస్రా?.. బొద్దు మీసం... బుంగ మీసం... కోర మీసం.. గొంగళిపురుగు మీసం... రొయ్య మీసం... జెర్రి మీసం... బొద్దింక మీసం... ఇలా ఎన్నో రకాలున్నయ్! 'బుల్లి ఉపన్యాసం దంచాడు మేష్టారు.

'మరి... మాకులేవేం సార్ మీసాలు?-'

'ఇప్పుడు మీరు చిన్నపిల్లలు కదా?... వయసొచ్చాక అవే మొలుస్తయ్ మూతి మీద...' నవ్వేడు.

'అప్పుడు మేమూ మీకు మల్లే మీసాలు పెంచాలా మాష్టారూ?-'

'ఒరేయ్ పిల్లలూ మీకు తెలుసో లేదో... నాకున్నంత పెద్ద పెద్ద మీసాలున్న వ్యక్తి మన వూళ్లోనే కాదు మన జిల్లాలోనే లేడు తెలుసా!?- నా మీసాలు చూచి ముచ్చటపడిన కలక్టర్ గారు నాకు సన్మానం చేసి గోల్డు మెడల్ ప్రజంట్ చేశార్రా...'

'ఎందుకు మీకు సన్మానం చేశారు సార్' శిష్యులు ముక్తకంఠంతో ప్రశ్నించారు.

'అబ్బో... అదొక పెద్ద కథలే! చెప్పమంటారా?' చెప్తా వినండర్రా!- అందాల పోటీలు... కుస్తీ' పోటీల్లాంటివి జరుగుతున్నట్టే... మన జిల్లా కలెక్టర్ గారికి సరికొత్త ఆలోచన వచ్చింది. వచ్చి... మీసాల పోటీ నిర్వహించారు. ఎవరికి అతిపెద్ద మీసముంటుందో వారిదే గెలుపు!- పోటీకి చాలా మంది వచ్చారు! కానీ అందరితో పోలిస్తే... కాదు కాదు... స్కేలుతో కొలవగా నాదే పెద్ద మీసమని న్యాయనిర్ణేతలు నిర్ధారించటంతో ఆసన్మానం... గోల్డు మెడలు నాకుదక్కాయి. అదర్రా విషయం! చూశారా మీసాలు అందంగ సుందరంగ పెంచినందు వల్ల కలిగే లాభం! కాబట్టి... మీరంతా పెద్ద వాళ్లయ్యాక నాకు మల్లేనే మీసాలు పెంచండి! ఏం?...'

మాష్టారి మాటలు విన్న పిల్లలు సంబరపడుతూ చప్పట్లు చరిచారు.

'సార్! మాకో సందేహం...'

'ఏమిటది?-'

'ఇంతంత మీసాలుంటే మీరు భోజనం ఎలా చేస్తారు? అసహ్యంగా మీసాలు అడ్డురావూ?... మీసాలు ఎంగిలిపడిపోవూ....?'

'మీసాలతో ఇబ్బందేమీ వుండదా సార్..'

మాష్టారు తల అడ్డంగా ఆడించారు.

'మీరు పిల్లలను ముద్దు పెట్టుకునేటప్పుడు చక్కిలిగిలిగా వుండవా?.. అప్పుడు మీ మీసాలను ఎత్తి పట్టుకుని ముద్దాడతారా?...'

'ఏడిశార్లే వెధవల్లారా? ఇక మాటలు కట్టి పెట్టి భాస్కరశతకంలో పద్యం వల్లె వేయండి' అనేసి మీసం దువ్వాడు.

× × × × ×

పండక్కు మాష్టారిని భోజనానికి ఆహ్వానించారు తహశీల్దారు దపంతులు. పిలిస్తే చాలు అభ్యంతరం చెప్పకుండా భోజనానికి వెళ్లటం మాష్టారికి ఇష్టం!.

భోజనానికి కాస్తంత వ్యవధి వున్నందున తహశీల్దారు గారు మాష్టారితో పిచ్చా పాటీ కబుర్లలోకి దిగారు.

'మాష్టారూ! మా అబ్బాయి ఎలా చదువుతున్నాడు?-'

'మీవాడికేమండి!... చదువుల సరస్వతి. సూక్ష్మగ్రహి తెలివైనవాడు..'

'అలాగా!- నా కొడుకు కదాని మావాడిని దండించటానికి వెనకాడొద్దు...'

'అలాగే!... నేనసలు పిల్లలను దండించను సార్'.

'అన్నట్టు... మీరు బ్రహ్మచారిగానే వుండిపోయారెందుకని? మనిషి అన్నాక ఒకతోడు అవసరం కదా? ఎన్నాళ్లని మీరు కష్టపడతారు?-'

'అదో పెద్ద కథ!- నేనసలు సినీమాల్లో నటించాలని పిన్న వయసులో ఎంతో వుబలాటపడ్డాను. నన్ను హిరణ్య కశిపుడు వేషం ఖాయం చేసి అయిదొందలు అడ్వాన్స్ ఇచ్చారు. కానీ ఆ పిక్చర్ సగంలో ఆగిపోవటంతో వెనక్కు తిరిగొచ్చి భుక్తికోసం పదిమంది పిల్లలను పోగేసుకుని ట్యూషన్లు చెప్పుకుని బ్రతుకీడుస్తున్నాను. ఇక పెళ్లి విషయమంటారా?- నన్ను చూసిన ఆడపిల్లలందరూ మీసం తీసేస్తేగాని పెళ్లి చేసుకోమన్నారు. ఆ కారణంగా ఎన్నో సంబంధాలు కుదరక చెడిపోయినయ్- మీసం తీయటం నాకు ససేమిరా ఇష్టం లేదు. మగాడికి మీసమేకదండి అందం!- ఎంతో ముద్దుగ ముచ్చటపడి పెంచుకుంటున్న మీసాన్ని ఎవరికోసమో ఎందుకు తీసేయాలి

సార్? నా తండ్రి కాలం చేసినప్పుడు కూడా మీసం గొరిగించుకోలేదు సార్ నేను! తర్వాత పెళ్లీడు మించి పోవటంతో ఇక పెళ్లే వద్దని తీర్మానించుకున్నాను.'

'భలే వారు మేష్టారూ మీరు. లేవండి... దొడ్లో నూతి దగ్గరకెళ్లి కాళ్లు కడుక్కొచ్చి భోజనం చేద్దాం... మా ఆవిడ కేకేసింది వడ్డన అయిందని...'

తహశీల్దారు మాష్టారితో పెరట్లోకి నడిచారు.

'ఏమిటి చాలా హడావుడి చేశారు... ఇన్ని వంటకాలా?... ఏంటి ఈరోజు స్పెషల్?-' పీట మీద కూర్చుని అడిగేడు మాష్టారు.

'మాపెళ్లిరోజు మేష్టారూ! మీ వంటి యోగ్యుడైన వారికి భోజనం పెట్టి తృప్తి పడాలన్పించింది. మిమ్మల్ని ఆహ్వానించాం..' ఔపోసన పడుతూ అన్నాడు తహశీల్దారు.

'ఆవడలు... పులిహోర... పాయసం... గులాబ్‌జామున్... నాలుగు కూరలు... రెండు పచ్చళ్లు... తోటకూర పప్పు అమ్మో... ఇవన్నీ తినటం నావల్ల కాదు....'

'మీకు ఏది తినాలన్పిస్తే అది నింపాదిగ భోజనం చేయండి మాష్టారూ... తొందరపడకండి. మీరు కడుపునిండా ఆరగిస్తేనే మాకు ఆనందం తృప్తీ...' శారదాంబ నెయ్యి వడ్డిస్తూ అంది.

చేయికడిగి వస్తూ 'బ్రహ్మాండమైన విందుభోజనం పెట్టారు- మీ దంపతులిద్దరూ నూరేళ్లపాటు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లండి...'

మేష్టారికి పండు తాంబూలం ఇచ్చికాళ్లకు నమస్కరించాడు.

'వట్టి తాంబూలమే అనుకున్నాను. కానీ నూటపదహార్లు ఇవ్వకపోతేనేం సార్...'

'ఏదోమాతృప్తి! మా అబ్బాయి మీ శిష్యుడు కదా?! వట్టి చేతులతో పంపటం మాకు ఏం మర్యాద మేష్టారూ...' వినయం పుట్టిపడింది శారదాంబ మాటల్లో.

ఒకరోజు మేష్టారు వూళ్లోకి నడిచి వస్తూండగా అంతా ఆయనకేసి ఆశ్చర్యంగా చూసేవారే! విస్తుపోయే వారే...

మాష్టారు మీసేలేమైనయ్?... ఇంత వయసొచ్చాక ఇంకాదేనికి లెమ్మని తీయించేశాడా?.. మీసమంటే మాష్టారికి ఆరో ప్రాణం కదా... అట్లాంటి పెద్ద మనిషి ఇన్నేళ్లలో ఏనాడూ లేనిది ఇప్పుడూ మూతిమీసం తీసేయటమేమిటి? ఎందుకని

తీయించుకోవలసి వచ్చింది?

'ఏం మాష్టారూ!... మీరు కొత్తగ అవుపిస్తున్నారేంటి?..' కరణంగారు ఎదురై అడిగారు.

సమాధానం ఏమివ్వాలో తోచక... చెప్పుకుంటే సిగ్గు చేటన్పించటంతో బదుల్వికుండానే ముందుకు సాగిపోయాడు మేష్టారు.

'ఏం సార్... మీ మూతిన మీసమేమైందీ? కాకెత్తుకుపోయిందా ఏమిటి?' మరో పెద్ద మనిషి తారసపడి వెటకారంగా మాట్లాడేడు.

'మీసం లేకపోతే మీరేం బాగుండలేదు మాష్టారూ... మళ్లీ పెంచండి... వెంట్రుకలకేమొచ్చె వారం తిరక్కుండానే మొల్చుకొస్తయ్...' ఆర్.ఎం.పి డాక్టరు తనకు తోచింది చెప్పి పక్కసందులోకి వెళ్లిపోయాడు.

ఏమిటీ విషమ పరిస్థితి? ఎవరికీ చెప్పుకోలేనంత అవమానం జరిగింది తనకు! ఇలా జరిగినందుకు తాను బాధపడటం మాటలా వుంచి... అడిగే వారందరికీ జవాబు చెప్పలేక మేష్టారి చావుకొస్తోంది.

ఆరోజు మధ్యాహ్న భోజనం ముగిసాక పిల్లలను పంచలో చదువుకోమని చెప్పి తాను నవ్వారు మంచంమీద నిద్రకుపక్రమించాడు.

మాష్టారు గుర్రుపెట్టి నిద్రపోవటం గమనించిన ఆకతాయి శిష్యులు ఏకమై అందరూ కూడ బలుక్కుని మేష్టారుకి తాటాకులు కట్టి ఏడిపించాలని.. నిద్రలో వున్న మేష్టారికి ఏమాత్రం మెలకువ రాకుండా అతిచాక చక్యంగా కత్తెరతో మాష్టారి మీసాలు కత్తిరించారు.

ఇహనుండి మనస్టారు... మీసాల మేష్టారు కాదురా.... వట్టి మేష్టారే.. అనేసి నవ్వుకున్నారు పిల్లలంతా తమలో తాము.

ఒరేయ్... సార్ గారికి ఈ పని మనమే చేశామని తెలిస్తే మన తాట తీస్తాడేమోరా..

అవున్రోయ్! చావగొట్టి చెవులు మూస్తారు ఇంటింటికీ వచ్చి మన అమ్మనాన్నలతో ఫిర్యాదు చేస్తారేమో!

ఏమోరా... నాకైతే భయంగా వుంది...

మేష్టారి మీసాలు కత్తిరించేసిన ఆకతాయి శిష్యులు ఒక్క క్షణం కూడా

అక్కడ వుండ నమస్కరించక భయంతో వణికిపోతూ ఇళ్లకు పరుగెత్తారు.

నిద్రలేచాక మేష్మారికి ఏం జరిగిందో గ్రహించాడు. అందుకు పిల్లల మీద కోపం రాలేదు. పేరెంట్స్‌కి ఫిర్యాదు చేయటానికి మనస్కరించ లేదు.

జరిగింది అవమానంగ భావించనూ లేదు.

ఇకపై తాను మీసాల మాష్మారు కాదు. వట్టి మాస్టారు మాత్రమే!- ఇక జన్మలో తాను మీసం పెంచకూడదని శపథం చేశాడు. వాస్తవాన్ని ఎవరికీ చెప్ప తల్చుకోని మేష్మారు పిల్ల చేష్ఠలను తన కడుపులోనే దాచుకున్నాడు.

దటీజ్ మీసాల మేస్టారు!!

(సమాప్తం)